www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

## షైనింగ్ స్టార్స్ అవార్డ్స్‌కు శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక

**పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభతో షైనింగ్ స్టార్స్ అవార్డ్స్‌కు ఎంపిక**

**పాఠశాల కరస్పాండెంట్ బి చక్రపాణి రెడ్డి**







**వేంపల్లె,జూలై16.అక్షర టైమ్స్:**–ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమానికి వేంపల్లిలోని శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు జూటూరు రజిత, కె. షైనీ రోషిణి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఈ అవార్డులకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన బోధన ఫలితంగానే ఈ గౌరవం దక్కిందన్నారు. అనంతరం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి, బి. చైతన్య రెడ్డి ఎంపికైన విద్యార్థినులు జూటూరు రజిత, కె. షైనీ రోషిణిలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

# చేతులు లేని ఆ జగన్నాథుడే జగత్తుకే రక్షకుడు!

**పూరి క్షేత్ర మహా వైభవం భక్తి,తత్వం,రథయాత్ర విశిష్టత**





భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని అలంకరించిన చార్‌ధామ్ పుణ్యక్షేత్రాలలో ఒడిశా రాష్ట్రంలోని పూరి శ్రీ జగన్నాథ ఆలయం అత్యంత మహిమాన్వితమైనది. ఇక్కడి గర్భగుడిలో కొలువై ఉన్న శ్రీ జగన్నాథ స్వామి, ఆయన అన్న బలభద్రుడు, సోదరి సుభద్రాదేవి విగ్రహాలు ప్రపంచంలోని మరే దేవాలయంలోనూ కనిపించని ప్రత్యేక రూపంతో భక్తులను ఆశ్చర్యానికి, ఆపై ఆత్మీయ భక్తి పారవశ్యానికి గురిచేస్తాయి. ఈ దివ్యమూర్తులకు పూర్తిస్థాయి చేతులు, కాళ్లు ఉండవు. విశాలమైన గుండ్రటి నేత్రాలు, చెక్కతో రూపొందిన అద్భుత రూపం వెనుక భక్తి, తత్వం, పురాణ గాథలు అంతర్లీనంగా ఉన్నాయి.

**వేప దారువులతో దివ్య విగ్రహాలు**

పూరి జగన్నాథ ఆలయంలోని మూలవిరాట్లను రాయి లేదా లోహంతో కాకుండా పవిత్రమైన వేప దారువులతో తయారు చేయడం విశేషం. నిర్దిష్ట జ్యోతిష్య గణనల ప్రకారం సుమారు 12 లేదా 19 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే "నవకళేబర" మహోత్సవంలో కొత్త దారువులతో విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ సంప్రదాయం భారతీయ దేవాలయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదిగా భావించబడుతుంది.

**విశ్వకర్మ షరతు రాజు ఆతురత**

పురాణాల ప్రకారం మాళవ దేశాధీశుడు ఇంద్రద్యుమ్న మహారాజు జగన్నాథుని ఆలయాన్ని నిర్మించి, విగ్రహాల రూపకల్పనకు తగిన శిల్పిని అన్వేషిస్తాడు. అప్పుడు దేవశిల్పి విశ్వకర్మ వృద్ధుడి వేషంలో ప్రత్యక్షమై ఒక షరతు విధిస్తాడు."ఇరవై ఒక్క రోజుల పాటు నేను మూసివేసిన గదిలో విగ్రహాలను రూపొందిస్తాను. ఆ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తలుపులు తెరవకూడదు" అని రాజుకు చెబుతాడు.రాజు అంగీకరిస్తాడు. కానీ కొన్ని రోజుల తరువాత లోపల నుంచి ఎలాంటి శబ్దం వినిపించకపోవడంతో ఆందోళన చెందిన రాజు పద్నాలుగో రోజే తలుపులు తెరిపిస్తాడు. షరతు భంగం కావడంతో విశ్వకర్మ అంతర్ధానమవుతాడు. అప్పటికే విగ్రహాలు అసంపూర్ణ స్థితిలోనే ఉంటాయి. చేతులు, కాళ్లు పూర్తిగా రూపుదాల్చవు.తన తప్పును గ్రహించి రాజు పశ్చాత్తాపపడగా, భగవంతుడు అశరీరవాణిగా ప్రత్యక్షమై"నేను ఇదే రూపంలో భక్తులను అనుగ్రహిస్తాను" అని అభయమిచ్చాడని పురాణాలు పేర్కొంటాయి.

**పెద్ద నేత్రాలు అపారమైన కరుణకు ప్రతీక**

జగన్నాథుని విశాల నేత్రాలకు రెప్పలు ఉండవు. ఈ రూపం ద్వారా జగత్తులోని ప్రతి జీవిని, వారి కష్టసుఖాలను భగవంతుడు నిరంతరం గమనిస్తూ ఉంటాడనే ఆధ్యాత్మిక భావన వ్యక్తమవుతుంది. అలాగే పూర్తిస్థాయి చేతులు లేకపోవడం కూడా గొప్ప తాత్విక సందేశాన్నే అందిస్తుంది. భగవంతునికి భౌతిక అవయవాల అవసరం లేదు. భక్తుడు నిష్కపటమైన హృదయంతో ప్రార్థిస్తే ఆయన అనుగ్రహం సర్వవ్యాపకంగా ప్రసరిస్తుందనే విశ్వాసానికి ఇది ప్రతీక. ఈ దివ్యరూపాన్ని దర్శించడం ద్వారా అహంకారం తొలగిపోతుందని, బాహ్య సౌందర్యం కంటే అంతరంగ పవిత్రతే శ్రేష్ఠమనే జ్ఞానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. జగన్నాథుని దర్శనం పాపాలను హరించి మోక్షమార్గాన్ని ప్రసాదిస్తుందని శాస్త్రోక్త విశ్వాసం.

**రథయాత్ర భూలోక వైకుంఠాన్ని తలపించే మహోత్సవం**

ప్రతి ఏడాది ఆషాఢ శుక్ల ద్వితీయ నాడు ప్రారంభమయ్యే పూరి జగన్నాథ రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక మహోత్సవం. కోట్లాది మంది భక్తులను ఆకర్షించే ఈ ఉత్సవంలో మూడు అద్భుతమైన చెక్క రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. శ్రీ జగన్నాథుని నందిఘోష, బలభద్రుని తాళధ్వజ, సుభద్రాదేవి దర్పదలనం అనే మూడు రథాలను ప్రతి ఏడాది కొత్తగా నిర్మించడం ఈ మహోత్సవంలోని విశిష్ట సంప్రదాయం.స్వామివారు గుండిచా ఆలయానికి రథాలపై ఊరేగింపుగా వెళ్లే వేళ లక్షలాది మంది భక్తులు రథాల తాడును లాగుతూ "జై జగన్నాథ్" నినాదాలతో ఆకాశాన్ని మార్మోగిస్తారు. రథతాడును ఒక్కసారి తాకినా పుణ్యం లభిస్తుందని విశ్వాసం.వారం రోజుల అనంతరం జరిగే తిరుగు ప్రయాణాన్ని బహుడా యాత్రగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా కూడా అపారమైన భక్తజనం స్వామివారిని దర్శించి తరించుకుంటారు గర్భగుడిలో మాత్రమే కాదు, రథంపై వీధుల్లోకి వచ్చి కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ దర్శనమిచ్చే కరుణామూర్తి జగన్నాథుడు. చేతులు లేకున్నా జగత్తంతటినీ ఆలింగనం చేసే దయామయుడు ఆయన. కాళ్లు లేకున్నా భక్తుని హృదయంలోకి చేరుకునే పరమాత్మ ఆయన.పూరి రథయాత్ర భక్తికి, సమానత్వానికి, విశ్వమానవత్వానికి ప్రతీకగా నిలిచే మహోత్సవం. ఆ జగన్నాథుని దివ్య దర్శనం ప్రతి భక్తుడి జీవితాన్ని ధన్యం చేయాలని మనసారా కోరుకుందాం. "జగన్నాథ స్వామి నయనపథగామీ భవతు మే."

బొల్లు రామమోహన్ రచయిత,పోరుమామిళ్ల

## పార్టీ పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలి

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామిరెడ్డిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి**




**కడప,జూలై16.అక్షర టైమ్స్:**– తెలుగుదేశం పార్టీ పదవులతో పాటు స్థానిక సంస్థల పదవుల్లోనూ యువతకు ప్రాధాన్యత కల్పించి అవకాశాలు ఇవ్వాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం కడపలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామిరెడ్డిని వేములకు చెందిన టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీలో యువతకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి యువత కీలక పాత్ర పోషించిందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన యువతకు గుర్తింపు ఇచ్చి పదవుల్లో అవకాశాలు కల్పించాలని, పార్టీ బలోపేతంలో వారిని భాగస్వాములను చేయాలని కోరారు.

## ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత ఆర్డిటీ సంస్థ ఆధ్వర్యంలో సరుకులు పంపిణి

**అనాథలు,వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు అండగా నిలవడమే సంస్థ లక్ష్యమని పోగ్రామ్ కోఆర్డినేటర్ అంకాల్ కుమార్ వెల్లడి**





**కోసిగి,జూలై16.అక్షర టైమ్స్:**– కర్నూలు జిల్లా కోసిగి ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థఏరియా పోగ్రామ్ కోఆర్డినేటర్అంకాల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు బియ్యం, పప్పులు,వంటనూనె, గోధుమలు, రాగులు, జొన్నలు తదితర నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా అంకల్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, అనాథలు,వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు అండగా నిలవడం ఆర్డిటి సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవసరమైన వారికి చేయూత అందిస్తూ వారి జీవన ఉపాధి మెరుగుపడేలా వివిధ సంక్షేమ కార్యక్రమాలను సంస్థ నిరంతరం చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐవోలు నరసింహులు వీరేష్ వీరస్వామి ప్రవీణ్ రఘు తదితరులు వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కడపలో వేగంగా రూపుదిద్దుకుంటున్న టీడీపీ నూతన కార్యాలయం

**నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ శ్రీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**






**కడప,జూలై16.అక్షర టైమ్స్:**– వైఎస్ఆర్ కడప జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న తెలుగుదేశం పార్టీ నూతన జిల్లా కార్యాలయ భవన నిర్మాణ పనులను గురువారం శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పరిశీలించారు. కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నేతలతో కలిసి ఆయన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి, పనుల ప్రగతిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఈ నూతన కార్యాలయం ఒక దేవాలయం లాంటిదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటానికి ఈ అత్యాధునిక కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యాలయ పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, పర్యవేక్షకులకు ఈ సందర్భంగా సూచించారు. కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యాలయం కీలక భూమిక పోషిస్తుందని జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీ భూపేష్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి జాబివుల్లా , మీడియా కోఆర్డినేటర్ జనార్దన్ , ప్రముఖ నాయకులు శ్రీ కర్నాటి అమర్ మరియు ఇతర ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**పట్టిసీమపై సీఎం గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా" తులసిరెడ్డి**

**వేంపల్లె,జూలై16.అక్షర టైమ్స్:**–పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ పోలవరం గ్రావిటీ ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అవసరం ఉండేది కాదని తులసిరెడ్డి అన్నారు. పోలవరం కుడి కాలువ ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు అందించే విధంగా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం కావడం వల్లే పట్టిసీమ అవసరం ఏర్పడిందని, పోలవరం పూర్తయిన తర్వాత పట్టిసీమ పథకం అవసరంపై ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టుల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని తులసిరెడ్డి సూచించారు.

## పార్టీ కోసం పనిచేసిన యువతకు గుర్తింపు కల్పించాలి

**మంత్రి నారా లోకేష్‌ను కోరిన తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి**



**వేంపల్లె,జూలై16.అక్షర టైమ్స్:**– టీడీపీ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన యువతకు గుర్తింపు కల్పించాలని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి మంత్రి నారా లోకేష్‌ను కోరారు. బుధవారం ప్రొద్దుటూరులో జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేస్తున్న యువతకు అవకాశాలు కల్పించి, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని కోరినట్లు తెలిపారు. యువతకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు.


## ప్రజా ప్రయోజనాలకు భంగం కల్గిస్తే చూస్తూ ఊరుకోం: ప్రజా సంఘాలు,జర్నలిస్ట్ సంఘాలు



**పోరుమామిళ్ల,జులై16.అక్షరటైమ్స్:**– స్థానిక రెవిన్యూ ప్రాంగణంలోని మైదుకూరు రోడ్డు వైపు వున్న స్థలం మీద కొంతమంది కన్ను పడిందే తడవుగా లీజు పేరుతో కాజేసేందుకు పావులు కదపడం ప్రారంభించారు. ప్రభుత్వ రికార్డుల్లో అధికారికంగా ప్రజల కోసం వున్న ప్రధాన ముఖద్వారాన్ని సయితం మాయం చేసే ప్రయత్నాలు ముమ్మురం చేశారు. దుర్మార్గపు ఆలోచనకు శ్రీకారం చుట్టి బిల్డింగ్ కాంట్రాక్టర్ కు భాధ్యత అప్పగించగా ఆయన పునాదులు తీసేందుకు మార్కింగ్ సిద్ధం చేశాడు. ఇది గమనించిన ప్రజలు, ప్రజా సంఘాలు, విలేకరులు గట్టిగా అడ్డుకోవడం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో ప్రజా ప్రయోజనాలను కాలరాస్తున్నారని, దాదాపు అన్ని శాఖల కార్యాలయాలు ఈ ప్రాంగణంలోనే వున్నాయని, కాంప్లెక్స్ నిర్మాణంవల్ల ప్రధాన ముఖ ద్వారం మూతపడితే విద్యార్థులు, రైతులు, మహిళలు, కార్యాలయాల సిబ్బంది, ఇటువైపు వున్న ఆరు బూతుల ప్రజలు కార్యాలయాల్లోకి దారిలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అంతేకాకుండా అనుకోని అత్యవసర పరిస్థితులు ఎదురయితే ఫైర్, అంబులెన్సు లాంటి వాహనాల సేవలకు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని నిలదీయడం జరిగింది. ఒక వ్యక్తి స్వార్థపూరిత ఆలోచనలకు ఆ వ్యక్తి పార్టీలోని సహచరులు సై అనడంతో ఈ తతంగం నడుస్తోందని ఇది సరికాదని పలువురు హితవు పలుకుతున్నారు, ఈ దుర్మార్గపు చర్యను అడ్డుకొనేందుకు ఆ ప్రాంత ప్రజలు సిద్ధమవుతున్నారు. సోమ్మొకరిది... సోకొకడిది చందాన స్థలం ప్రభుత్వానిది, షాపింగ్ నిర్మాణం చేపట్టేది జడ్పీ నిధులతో, వచ్చే బాడుగలు మాత్రం అక్రమ లీజు దారుడికి అన్నమాట. లీజు పేరుతో అప్పనంగా ప్రభుత్వ సొమ్మును కాజేస్తుంటే, ప్రజా ప్రయోజనాలు తుంగలో తొక్కేందుకు సిద్దపడుతుంటే ఏ మాత్రం చూస్తూ ఊరుకోమని, సహించేదిలేదని ప్రజలు, ప్రజా సంఘాలు, విలేకరులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

## నేడు బ్రహ్మంగారి మఠం కు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మెన్ రాక

**సతీష్,ఓబులేష్ కుటుంబాలను పరామర్శించనున్న చైర్మన్**




**బ్రహ్మంగారి మఠం, జూలై 16. అక్షర టైమ్స్:**– బ్రహ్మంగారిమఠం మండలంలోని మూడమాల గుండాపురం గ్రామాలకు చెందిన ఓబులేష్ సతీష్ వివాదాస్పద రీతిలో ఫిబ్రవరి మాసం లో మరణించిన నేపథ్యంలో ఆ విషయం పై ఇంకా ఎటువంటి సమాచారం లేని నేపథ్యంలో రాష్ట్ర దళిత సంఘాల నేతలు ఎమ్మార్పీఎస్ ఎంఈఎఫ్ ఎంఎస్పి నాయకులు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కమిషనర్ జవహర్ ను కలిసి బాధ్యత దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని హత్య వెనక ఉన్న నేపథ్యాన్ని నిగ్గు తేల్చి నిజా నిజాలు వెలికి తీసి బాధ్యత కుటుంబాలకు న్యాయం చేకూర్చాలని దళిత సంఘాల కోరగా వారి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ శుక్రవారం నాడు బ్రహ్మంగారిమఠంకు రానున్నట్లు దళిత ప్రజా సంఘాలు తెలియజేశాయి.

## భూ అక్రమాలపై లోకేష్‌కు ఫిర్యాదు సమగ్ర విచారణకు హామీ

**ఫిర్యాదు చేసిన ప్రహ్లాద రెడ్డి**




**కలసపాడు, జూలై 16. అక్షరటైమ్స్:**– కలసపాడు మండలంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ, డీకేటీ (ఇఖు) భూముల కబ్జాలు, అక్రమ కేటాయింపులపై టీడీపీ యువ నాయకుడు చంద్రగిరి ప్రహ్లాద రెడ్డి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. రాజకీయ పలుకుబడితో అనర్హులకు పట్టాలు ఇవ్వడం వల్ల పేదలు నష్టపోయారని ఆయన వివరించారు. మంత్రి లోకేష్ స్పందన: ఈ అంశంపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు. పేదల భూములను కాజేసిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ చర్యలు: అక్రమ పట్టాలను రద్దు చేసి, కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆ భూములను రీ-లేఅవుట్ చేసి, భూమి లేని నిరుపేద కుటుంబాలకు 1.50 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలుగా, సాగు భూమిగా పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని లోకేష్ స్పష్టం చేశారు.

# పట్టిసీమపై సీఎం గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా" తులసిరెడ్డి**



**వేంపల్లె,జూలై16.అక్షర టైమ్స్:**-పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ పోలవరం గ్రావిటీ ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే పట్టిసీమ ఎత్తిపోతల పథకం అవసరం ఉండేది కాదని తులసిరెడ్డి అన్నారు. పోలవరం కుడి కాలువ ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు అందించే విధంగా ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం కావడం వల్లే పట్టిసీమ అవసరం ఏర్పడిందని, పోలవరం పూర్తయిన తర్వాత పట్టిసీమ పథకం అవసరంపై ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టుల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలని తులసిరెడ్డి సూచించారు.

# నీలాపురం గ్రామ విద్యార్థిని మలిరెడ్డి పల్లవికి ప్రతిభ పురస్కారం

**సంతోషం వ్యక్తం చేసిన తండ్రి మలిరెడ్డి సుదర్శన్ రెడ్డి**

**ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభకు పురస్కారం**



**దువ్వూరు.జూలై16.అక్షర టైమ్స్:**-తిరుమల తిరుపతి దేవస్థానం 150 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం -2026" పేరిట ఘనంగా పురస్కారాలను అందజేసింది. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించడం జరిగింది. దీనిలో భాగంగా కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం దువ్వూరు మండల పరిధిలోని నీలాపురం గ్రామానికి చెందిన మలిరెడ్డి సుదర్శన్ రెడ్డి కుమార్తె మలిరెడ్డి పల్లవి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 455 మార్కులకు గాను 445 మార్కులు సాధించడం జరిగింది. ఉత్తమ మార్కులు సాధించినందుకు గాను పల్లవికి ప్రతిభా పురస్కారం అందజేశి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పల్లవి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కూతురికి ప్రతిభా పురస్కారం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే సుదర్శన్ రెడ్డి చిన్న కుమార్తె కూడా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీటు సంపాదించడం జరిగింది. తమ గ్రామ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల గ్రామంలోని పెద్దలు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఆదోని మండలం -2 తాసిల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని రెవెన్యూ మంత్రికి వినతి

**ఆదోని రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: మంత్రి అనా గాని సత్య ప్రసాద్ హామీ**



**ఆదోని,జూలై16.అక్షర టైమ్స్:**-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ను ఆదోని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మారుతి నాయుడు మరియు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి ఆదోని నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక రెవెన్యూ అంశాలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఆదోని మండలంబి2 లో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు తాసిల్దార్,విఆర్ఓలు మరియు అవసరమైన కార్యాలయ సిబ్బందిని తక్షణమే నియమించి, పూర్తిస్థాయి మండల కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. అలాగే మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతులను మశీత్రి అనగాని సత్య ప్రసాద్ సానుకూలంగా పరిశీలిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి స్పందన పై మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి హర్షం వ్యక్తం చేస్తూ, ఆదోని మండలం బి2 లో పరిపాలన వ్యవస్థ త్వరితగతిన పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు..

# ఓటర్ల సవరణ వేగవంతం

**కలెక్టర్ రాజకుమారికి సీఈఓ ఆదేశాలు**



**నంద్యాల,జూలై16.అక్షర టైమ్స్:**- ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ-2026 కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఓటర్ల వివరాల నమోదు, గైర్హాజరైన, నివాసం మార్చుకున్న, మరణించిన ఓటర్ల జాబితాల తయారీ, లోపాల నివారణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, క్షేత్రస్థాయి అధికారుల పెండింగ్ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి జిల్లాలో చేపట్టిన సవరణ పనుల పురోగతిని వివరించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, నమోదు కాని ఓటర్లను గుర్తించి వివరాలు నమోదు చేయాలని, పాత ఫోటోల స్థానంలో తాజా రంగు ఫోటోలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. లోపాల పరిష్కారం, గైర్హాజరైన--నివాసం మార్చుకున్న--మరణించిన ఓటర్ల జాబితాల ఖరారు, పెండింగ్ పనుల పూర్తి, పోలింగ్ కేంద్రాల వివరాల సవరణ వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని సూచించారు. వచ్చే శనివారంలోగా గణనీయమైన పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డ్స్‌కు సెయింట్ ఆంటోనీస్ హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక













**పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖరరెడ్డి**

**కలసపాడు,జూలై16అక్షర టైమ్స్:**- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమానికి కలసపాడు సెయింట్ ఆంటోనీస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు వి. జీ. యస్. కార్తీక్,జీ.శ్వేత,వై.దీక్షిత, యస్. వైష్ణవిఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు ఈ అవార్డులకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన బోధన ఫలితంగానే ఈ గౌరవం దక్కిందన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ చిత్తా ప్రభావతి ఎంపికైన విద్యార్థులు వి. జీ. యస్. కార్తీక్,జీ.శ్వేత,వై.దీక్షిత, యస్. వైష్ణవి లను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

# దిక్కుతోచని స్థితిలో 6 వేల ఎకరాల ఆయకట్టు రైతులు

**తెలుగుగంగ బ్రహ్మసాగర్ నుంచి వెంటనే నీరు విడుదల చేయాలి:-వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి**



**పోరుమామిళ్ల,జూలై16.అక్షర టైమ్స్:**- రాయలసీమలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చెరువుల్లో ఒకటైన కడప జిల్లా పోరుమామిళ్ల పెద్ద చెరువు పూర్తిగా అడుగంటిపోవడం వేలాది మంది రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులతో పాటు చేపల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా చెరువులోని నీరంతా వృథాగా పోవడంతో సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో పడిందన్నారు. ఈ చెరువుపై ఆధారపడి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నార్లు పోసుకున్న రైతులు ఇప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు.

**చేపల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం**

రైతుల ఆరోపణల ప్రకారం, చెరువులో చేపల పెంపకం చేపట్టిన కాంట్రాక్టర్ తన చేపల వేట కోసం చెరువులోని నీటిని బయటకు వదిలేయడంతో సాగునీరు పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఒక కాంట్రాక్టర్ లాభపడగా వేలాది మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

**సాగు సీజన్ ప్రారంభంలోనే సంక్షోభం**

మే నెల నుంచే రైతులు నార్లు పోసుకుని సాగుకు సిద్ధమయ్యారని, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తయ్యాయని, మరికొన్ని ప్రాంతాల్లో నారు ముదిరి నాటుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చెరువులో పెద్ద తూము వద్ద మాత్రమే కొద్దిపాటి నీరు మిగిలి ఉందని, అది కూడా మరో 20 రోజుల వరకు మాత్రమే సరిపోతుందని చెప్పారు. మిగిలిన తూముల పరిధిలోని రైతులకు వారం నుంచి పది రోజులకు మించి నీరు అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

**తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు**

చెరువు పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు కూడా గణనీయంగా పడిపోయాయని తెలిపారు. సాగునీరు లేకపోవడమే కాకుండా గ్రామాల్లోని బోర్లలో తాగునీరు కూడా అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. పోరుమామిళ్లతో పాటు కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల్లోని చెరువులు కూడా నీరు లేక వెలవెలబోతున్నాయని పేర్కొన్నారు.

**తెలుగుగంగ నీటి విడుదలే పరిష్కారం**

ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగుగంగ బ్రహ్మసాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. దీనివల్ల సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుందని అన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాల పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఆ పనులు పూర్తయితే వరికుంట్ల, ఇటుగుల్లపాడు, గంగనపల్లి, బాలాయపల్లి, తెల్లపాడు, తడుకు తదితర వెనుకబడిన గ్రామాలకు కూడా సాగునీరు అందుతుందని తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత ధ్వజ స్తంభము,గంగమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మంగళవాయిద్యాలు, బాణసంచ మధ్య రెడ్యం సోదరులు

**ఖాజీపేట,జూలై16.అక్షర టైమ్స్:**- ఖాజీపేట పంచాయతీ, బుడ్డాయపల్లె గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామ లక్ష్మణ సమేత ధ్వజ గంగమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు భక్తులు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాముల వారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుడ్డాయి పల్లె గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైయస్సార్ సిపి నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిలు హాజరైనారు. వీరితో పాటు వైయస్సార్ సిపి, బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాయుడు యాదవ్, వైయస్సార్ సిపి యువజన విభాగం మండల అధ్యక్షుడు ముత్తూరు రమణ, వైయస్సార్ సిపి నేతలు మాజీ సర్పంచ్ తప్పెట చంద్ర,రెడ్యం నాగేశ్వర్ రెడ్డి, సానేపల్లె సుబ్బారెడ్డి, ఏనుగు బాలసుబ్బారెడ్డి, కడప గురు ప్రసాద్, సారే రంగయ్య, గంగిరెడ్డి సుదర్శన్ రెడ్డి పలువురు హాజరైనారు. వారందరినీ బుడ్డాయ పల్లె గ్రామ పెద్దలు, ప్రజలు మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని గుడి ప్రాంగణం లోకి చేరుకున్న రెడ్యం సోదరులు, వైయస్సార్ సిపి నేతలకు అర్చకులు, వేద పండితులు, గ్రామ పెద్దలు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. రెడ్యం సోదరులు ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి సిమెంట్, కంకర స్వయంగా వేయడంతో పాటు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ సీతారామ లక్ష్మణ, గంగమ్మ, పోతురాజు స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెడ్యం సోదరులతో పాటు వారి వెంట వచ్చిన వారందరికీ వేద పండితులు, అర్చకులు, గ్రామపెద్దల పూల మాలలు, కండువాలు వేసి ఘనంగా సత్కరించారు. వేద పండితులు వారందరికీ తీర్థ, ప్రసాదాలు అందించి అక్షింతలు చల్లి వేద ఆశీర్వాదం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన గ్రామస్తులు, భక్తులకు రెడ్యం సోదరులు పలకరించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని... తమను ఆప్యాయంగా పలకరించి, ఘన స్వాగతం పలికి, సత్కరించిన గ్రామ పెద్దలకు, ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు యెన్నం శోభన్ బాబు, కొత్తపల్లి ఓబన్న, కొత్తపల్లి చిన్న ఓబులేసు, జక్కల శేఖర్, దాసరి వెంకటసుబ్బయ్య, ఓబులపు నాగేశ్వరరావు, ఇనాం డేవిడ్ కుమార్, అల్లూరు ఓబులేసు, కొత్తపల్లె పెద్ద ఓబులేసు, ఓబులపు చిన్న చెన్నయ్య,ఓబులపు గుల్లి చెన్నయ్య, ఓబులపు చంద్రాయుడు, దాసరి రమణయ్య పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

# పొన్నాపురం కాలనీ సమస్యల పరిష్కారానికి ఎన్ఎండి ఫయాజ్ కీలక చొరవ

**త్వరలోనే రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామని హామీ**

**వెనువెంటనే చెత్త తొలగింపు, శానిటైజేషన్ పనులు ప్రారంభం**





**నంద్యాల,జులై16.అక్షర టైమ్స్:**- నంద్యాల పట్టణ పరిధిలోని 19 వార్డ్ పొన్నాపురం కాలనీ, పొన్నాపురం ప్రజల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ గురువారం పొన్నాపురం కాలనీలో స్వయంగా పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను స్వయంగా పరిశీలించిన ఆయన, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. కాలనీలో అధ్వాన్నంగా మారిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు త్వరలోనే శాశ్వత పనులను ప్రారంభిస్తామని ఫయాజ్ కాలనీవాసులకు తెలిపారు. పొన్నాపురం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే మున్సిపల్ సిబ్బంది సాయంతో తొలగింపజేశారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి చెందకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా కాలనీ వీధుల్లో తక్షణమే శానిటైజేషన్ (స్ప్రేయింగ్, బ్లీచింగ్) పనులను ప్రారంభించారు. కాలనీ ప్రజల ఆరోగ్యానికి, మౌలిక వసతుల కల్పనకు మా మొదటి ప్రాధాన్యత అన్నారు . పొన్నాపురం కాలనీ సమస్యలను దశలవారీగా పరిష్కరించి, ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతాం అని ఫయాజ్ తెలిపారు.ఈ పర్యటనలో ఫయాజ్ వెంట స్థానిక 19 వార్డ్ టీడీపీ ఇంచార్జి షేక్ మహమ్మద్ రఫీ (మున్నా), ఖాజా శంకర్, మాజీ ఎంపీటీసీ జనార్ధన్, జగదీష్ గౌడ్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ

**నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు: జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల,జూలై16.అక్షర టైమ్స్:**- నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలోని గోపాలకృష్ణ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా డీఏపీ, యూరియా విక్రయాలను ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్, బిల్లులు, ధ్రువపత్రాలు, భౌతిక నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఏపీఏఐఎంఎస్ ద్వారా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్, ఐఎఫ్ఎంఎస్ వివరాలు, భౌతిక నిల్వలు ఒకే విధంగా ఉండాలని ఆదేశించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించరాదని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎరువుల కొనుగోలుకు ఇతర ఉత్పత్తులను బలవంతంగా విక్రయించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు--1985 ప్రకారం చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కొత్తపల్లి సమీపంలోని జీలుగ పచ్చిరొట్ట పైరు సాగు చేసిన పొలాన్ని సందర్శించిన ఆయన, ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట పంటను సాగు చేసి నేలలో కలియదున్నడం ద్వారా నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.